తమ్ముడూ.. ఇక కుమ్ముడే..!

- మద్యం దందాకు తెరతీసిన టీడీపీ ప్రభుత్వం
- విజయదశమి నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు
- పల్లెల్లో కిక్కే కిక్కు
- బనగానపల్లెలో నియోజకవర్గంలో 21 మద్యం దుకాణాలు ఏర్పాటు

కొలిమిగుండ్ల: విజయదశమి అంటే విజయానికి నాంది.. ఏ ప్రభుత్వమైనా ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుంది. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా నూతన మద్యం పాలసీని అమల్లోకి తీసుకొచ్చి ప్రైవేట్ దుకాణాలను అందుబాటులోకి తీసుకురానుంది. దీంతో తాగినోళ్లకు తాగినంత మద్యాన్ని పుష్కలంగా అందించే ఏర్పాట్లకు శ్రీకారం చుడుతోంది. ఈనెల 12వ తేదీ నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 21 మద్యం దుకాణాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 9వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. 11వ తేదీ మద్యం షాపులకు లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. కాగా 21 షాపులకు స్పందన అంతంత మాత్రంగానే ఉంది.. వ్యాపారులు, టీడీపీ నేతలు సిండికేట్‌గా మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. లాటరీలో షాపు దక్కితే మామ్ముళ్లు ఇచ్చుకోవాల్సిందేనని గుసగుసలు వినిపిస్తున్నాయి. దరఖాస్తు గడువు ఇంకా రెండు రోజులు మాత్రమే మిగిలి ఉంది.



బనగానపల్లెలోని ఎక్సైజ్ కార్యాలయం

భారీగా లైసెన్స్ ఫీజులు

ప్రైవేట్ మద్యం దుకాణాలకు గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈసారి కూటమి ప్రభుత్వం భారీగా లైసెన్స్ ఫీజులు పెంచేసింది. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు కావడంతో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు చాలా మంది వెనకడుగు వేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్నాక లాటరీలో అదృష్టం పలకరిస్తే జనాభా ప్రాతిపదికన రూ.55 లక్షల నుంచి రూ.65 లక్షల వరకు లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. లైసెన్స్ ఫీజును నాలుగు విడతల్లో చెల్లించాలి. లక్షలు వెచ్చించి షాపు ఏర్పాటయ్యాక అమ్మకాలు జరిగి పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందా లేదా అనే మీమాంసలో కొందరు ఉన్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేయవచ్చని ప్రభుత్వం సూచించింది. దరఖాస్తు ఫీజు రూ.2లక్షలుగా నిర్ణయించింది. ఈ మొత్తాన్ని నాన్‌రీఫండబుల్‌గా పేర్కొనడంతో లాటరీలో షాపు దక్కకపోతే రూ.2లక్షలు మర్చిపోవాల్సిందే. అందుకే చాలా మంది అచితూచీ అడుగులు వేస్తున్నారు.

నియోజకవర్గంలో ప్రైవేట్ మద్యం దుకాణాలు	
మండలం	దుకాణాలు
కొలిమిగుండ్ల	03
అవుకు	02
సంజామల	04
కోవెలకుంట్ల	05
బనగానపల్లె	07

మత్తులో తూగనున్న పల్లెలు

ప్రైవేట్ మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో పల్లెల్లో మద్యం మత్తులో తూగనున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇకపై షాపులు ప్రైవేట్ పరం కావడంతో మందుబాబులకు నిబంధన లేకుండా ఎన్ని అడిగితే అన్ని బాటిళ్లు అందించనున్నారు. మందు బాబులు మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి ఇష్టానుసారంగా పొలాలు, ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు ఇలా ఒకటేమిటి ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవిస్తూ అడ్డాగా మార్చుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రజలతో పాటు మహిళలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

మద్యం దుకాణాలకు 23 దరఖాస్తులు

కోవెలకుంట్ల: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో నూతన మద్యం విధానంలో కేటాయించిన మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 23 దరఖాస్తులు అందినట్లు ఆ శాఖ సీఐ తాకీబాషా తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని ఆయా మండలాలకు 11 దుకాణాలకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో కోవెలకుంట్ల మండలంలోని షాపులకు 10, సంజామల మండలంలో 9, దొర్నిపాడు మండలంలో మూడు, ఉయ్యాలవాడలో ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ఉందని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

కోవెలకుంట్ల: వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఎలాంటి రికార్డులు లేకుండా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా కోవెలకుంట్లకు తరలిస్తున్నారని సమాచారం అందడంతో దాడి చేసినట్లు చెప్పారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

త్యాగరాజస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో స్వామివారు

కొలిమిగుండ్ల: స్థానిక నాయీబ్రాహ్మణ కాలనీలోని త్యాగరాజస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా వేదపండితుడు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి, కోదండరామస్వామి, సీతా,లక్ష్మణ విగ్రహాలను పూలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మీర్జాపురం మాజీ సర్పంచ్ పోరెడ్డి నారాయణరెడ్డి, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. భజన బృందం సభ్యులు అఖండ భజన చేశారు.

జోరుగా పారిశుద్ధ్య పనులు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో సోమవారం సర్పంచ్ శివరాముడు పారిశుద్ధ్య పనులు చేయించారు. మురుగు కాల్వల్లో చెత్తాచెదారం, బురదతో పూడిపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండేది. ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో కాల్వల్లో పేరుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి మురుగునీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. ఇళ్లలోని చెత్తను కాల్వల్లో వేయరాదని స్థానికులకు సూచించారు.

వాహన రికార్డులు తప్పనిసరి

బనగానపల్లె రూరల్: వాహనదారులు లైసెన్సుతో పాటు వాహన రికార్డులను తప్పనిసరిగా కలిగి ఉండాలని బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల క్రీడామైదానంలో ప్రైవేట్ స్కూల్, కళాశాలలకు చెందిన బస్సు రికార్డులు, డ్రైవర్ల లైసెన్సులను తనిఖీ చేశారు. స్కూల్ బస్సు డ్రైవర్లు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్ మాట్లాడరాదని తెలిపారు. రోడ్డు ప్రమాదల వల్ల జరిగే నష్టాలను సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని భీమునిపాడుకు చెందిన ఆరుగురు కూలీలు సీడుపత్తి పొలంలో పనులు చేసేందుకు ఆటోలో వెళుతుండగా కోవెలకుంట్ల మండలం కంపమల్ల మెట్ట సమీపంలో ఆటో, బైక్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. భీమునిపాడుకు చెందిన ఆటో డ్రైవర్ గుర్రప్ప, సుశీలమ్మ, ఉసేన్‌బాషా, ఉసేన్‌బీ గాయపడ్డారు. వీరిని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

వివాహిత ఆత్మహత్య


దస్తగిరమ్మ మృతదేహం

బనగానపల్లె: మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరమ్మ(45) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ మాబాషా వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఖాసీం, దస్తగిరమ్మ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు మహబూబ్‌వలీ(20) ఆరేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అప్పటి నుంచి దస్తగిరమ్మ తీవ్ర మనస్తాంతో ఉండేది. జీవితంపై విరక్తి చెంది సోమవారం పరుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. భర్త ఖాసీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

మహిళా చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న మహిళా న్యాయవాది తులసీశ్వరమ్మ

బనగానపల్లె రూరల్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు మహిళా న్యాయవాది తులసీశ్వరమ్మ అన్నారు. సోమవారం స్థానిక పొదుపు భవనంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం అనేక చట్టాలను రూపొందించిందని.. వాటిపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గృహహింస, మహిళల అక్రమ రవాణా, బాలికల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది అజాం హుస్సేన్, సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, వెలుగు ఏపీఎం శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు సాలమ్మ, చిట్టెమ్మ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

శనగ విత్తనాల రాయితీలో కోత

- 25 శాతానికే పరిమితం
- గత ప్రభుత్వంలో 40 శాతం సబ్సిడీ

కొలిమిగుండ్ల: రబీ సీజన్‌లో ప్రభుత్వం అందించే సబ్సిడీ శనగ విత్తనాల కొనుగోలు రైతులకు భారంగా మారాయి. విత్తనాల రాయితీ 25 శాతానికి కుదించడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మండలానికి 2480 క్వింటాళ్ల శనగలు మంజూరు కావడంతో ఆయా రైతు సేవా కేంద్రాల్లో రైతులు డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. బయట మార్కెట్‌లో శనగలు క్వింటా రూ.7వేల నుంచి రూ.7200 మాత్రమే పలుకుతోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అందించే శనగలు క్వింటా రూ.9400 కాగా అందులో 25 శాతం రాయితీ రూ.2350 పోను క్వింటాకు రూ.7050 రైతులు చెల్లించాల్సి ఉంటుంది. ఎకరా ఉన్న రైతులకు 40 కేజీలు, రెండు ఎకరాలకు 80 కేజీలు, ఐదు ఎకరాల్లోపు రైతులకు 200 కేజీలు చొప్పున ఇవ్వనున్నారు. గతంలో 25 కేజీల ప్యాకెట్లు ఉండగా ఈసారి 20 కేజీలకు పరిమితం చేశారు. గత రబీలో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని శనగ విత్తనాలపై 40 శాతం రాయితీ అందించి రైతులకు ఊరట కల్పించింది. కూటమి ప్రభుత్వం 25 శాతానికి పరిమితం చేయడంతో బయట మార్కెట్‌కు సబ్సిడీపై ఇచ్చే వాటికి పెద్దగా తేడా ఏం ఉందని రైతులు మండిపడుతున్నారు.


విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు

అన్నపూర్ణాదేవికి కాటసాని పూజలు


అమ్మవారి ప్రసాదం స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: పట్టణంలోని కొండపేటలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి సోమవారం అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన్ను ఆర్యవైశ్య సంఘం నాయకులు తీర్థప్రసాదాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపామని.. మొదటి విడతగా రూ.1.83 కోట్లు మంజూరయ్యాయని.. అయితే ఎన్నికలు రావడంతో ఆగిపోయాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం పనులను పూర్తి చేయాలని కోరారు. ఆర్యవైశ్య నాయకులు రవికుమార్, గధంశెట్టి వేణుగోపాల్, శ్రీరామవెంకటసుబ్రమణ్యం, వెంకట సుబ్బయ్య, విజయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బేతంచెర్ల: మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై మంగళవారం నుంచి సామాజిక తనిఖీ ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్‌ఆర్‌పీ మురాద్, సామాజిక తనిఖీ బృందాలతో సమావేశం నిర్వహించారు. ఒక్కో గ్రామంలో 3 రోజుల పాటు సామాజిక తనిఖీ జరుగుతుందని, అందరూ సహకరించాలని సూచించారు. ఏపీఓ శేషన్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని నెహ్రూ నగర్, తారకరామానగర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బేతంచెర్ల: మండలంలోని సిమెంట్‌నగర్ నుంచి బేతంచెర్లకు వచ్చే విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా డోన్, బనగానపల్లె, కర్నూలు రహదారిలోని పరిశ్రమలకు మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీ మధుసూదన్ రెడ్డి తెలిపారు. పరిశ్రమల యజమానులు సహకరించాలని కోరారు. అలాగే వ్యవసాయానికి తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

గాడుబావి స్థలం సర్వే

బేతంచెర్ల: పట్టణంలోని గాడుబావి వీరాంజనేయ స్వామి స్థలం సమీపంలో ఉన్న 413, 416 సర్వే నంబర్లలో హద్దులు గుర్తించాలని పట్టణానికి చెందిన పిట్టల జాకీర్ కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే అధికారులు చంద్రశేఖర్, సురేష్ సోమవారం సర్వే నిర్వహించారు. కొలుతలు తీసి హద్దులను గుర్తించినట్లు వారు తెలిపారు. తహసీల్దార్‌ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. సర్వేయర్లు హరి, రాఘవ, స్వాతి, మంజు, వినోద్ పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న సర్వేయర్లు

పాపం.. ఆవుదూడ


జాతీయ రహదారి డివైడర్ గ్రిల్‌లో ఇరుక్కున్న ఆవు తల

డోన్: పశువుల యజమానుల అలసత్వం, నిర్లక్ష్యం వల్ల నోరులేని మూగజీవాలు పడుతున్న ఇబ్బందులు అన్నీ, ఇన్నీ కావు. పశువులను ఎట్టిగా వీధుల్లోకి వదలడంతో రోడ్లపై వెళ్లే వాహనదారులు, పాదాచారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. కొన్ని సందర్భాలలో వాహనాలు ఢీకొని పశువులు గాయపడటం, మృతి చెందడం కూడా జరుగుతోంది. పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఉడుములపాడు గ్రామం వద్ద సోమవారం ఒక ఆవు రోడ్డు మధ్యన డివైడర్‌పై పచ్చిక మేస్తూ అనుకోకుండా రోడ్డు దాటేందుకు ప్రయత్నించగా ఇనుప గ్రిల్‌లో తల ఇరుక్కుపోయింది. బయటకు తీసేందుకు వీలుగాక దాదాపు గంట పాటు విలవిల్లాడింది. దీన్ని గమనించిన ఓ పాదాచారుడు చాకచక్యంగా ఆవు తలను గ్రిల్ నుంచి తప్పించడంతో క్షేమంగా అక్కడి నుంచి వెళ్లిపోయింది. అత్యంత వేగంగా వాహనాలు తిరిగే జాతీయ రహదారిపైకి పశువులను ఎట్టిగా వదలడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అధికారులు శ్రద్ధ వహించి పాడి పశువుల యజమానులు వాటిని రోడ్లపైకి వదలకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాధ్యతల స్వీకరణ

బేతంచెర్ల: ఎమెంట్‌నగర్ పంచాయతీ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన షేక్ బషీరున్‌బీ ఓర్వకల్లు మండలం నన్నూరుకు బదిలీ అయ్యారు. శిరువెళ్ల మండలం ఎర్రగుంట్ల పంచాయతీ కార్యదర్శిగా ఉన్న వెంకటేశ్వర్లు ఇక్కడికి వచ్చారు.

రాయితీ విత్తనాల పంపిణీ

బనగానపల్లె రూరల్: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా రైతులకు రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేశారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. ఏడీఏ సుధాకర్‌రెడ్డి, ఏఓలు సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం

బనగానపల్లె: విజయవాడ వరద బాధితుల కోసం మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సేకరించిన రూ.1,17,500లను సోమవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి అందజేశారు. స్థానిక మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో ఏపీపీయూఎస్‌ఏ సంస్థకు చెందిన ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు ఆయన్ను కలిసి చెక్కు అందజేశారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

ప్యాపిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి ప్రజల సమస్యపై వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

ఘనంగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ


ఉత్సవ విగ్రహాలకు పల్లకీపై ఊరేగిస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో సోమవారం ఉమామహేశ్వరస్వామి పల్లకీ సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, నివేదన తదితర కార్యక్రమాలు చేశారు. సాయంత్రం ఉత్సవవిగ్రహాలను పల్లకీపై కొలువుంచి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్, సర్పంచ్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోకపోతే ఆత్మహత్యే శరణ్యం

కోవెలకుంట్ల: కుందూనది వరదనీరు పంటలను ముంచెత్తుతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని, అధికారులు ఆదుకోకపోతే ఆత్మహత్యే శరణ్యమని బాధిత రైతు చెన్నకృష్ణారెడ్డి అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని జోళదరాశి గ్రామానికి చెందిన చెన్నకృష్ణారెడ్డి తన గోడు వెల్లబోసుకున్నాడు. కుందూనది పరివాహక ప్రాంతంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో మినుము, జొన్న పంట సాగు చేయగా నదికి వచ్చిన వరద నీరు పైర్లను ముంచెత్తిందని తెలిపాడు. వరదల కారణంగా పైర్లు దెబ్బతినగా మూడు నెలల వ్యవధిలో మూడు సార్లు విత్తనం వేయాల్సి వచ్చిందన్నారు. రసాయన ఎరువులు, విత్తనాలు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 8 వేల చొప్పున వెచ్చించానన్నారు. వరదనీరు పొలాలను ముంచెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లే రైతులు నష్టపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని విన్నవించారు.

నేడు శనగ విత్తనాలు పంపిణీ

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో మంగళవారం నుంచి శనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏఓ కిరణ్ కుమార్ సోమవారం తెలిపారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్‌రెడ్డి, ఏపీ సీడ్స్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి చేతుల మీదుగా పంపిణీ ఉంటుందన్నారు.

శక్తి స్వరూపిణీ.. రక్షమాం


ప్యాపిలి: లలితాదేవిగా వాసవీమాత


బేతంచెర్ల: సిమెంట్ నగర్‌లో శాకాంబరి


బేతంచెర్ల: అమ్మవారి శాలలో గాయత్రీదేవిగా


బేతంచెర్ల ప్రత్యేక పుష్పాలంకరణలో వాసవీ మాత


బనగానపల్లె నందవరంలో స్కంధమాత అలంకారంలో చౌడేశ్వరిదేవి

బనగానపల్లె రూరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో ఘనంగా జరుగుతున్నాయి. ఆయా ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. భక్తులతో ఆయా దేవాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. బనగానపల్లె మండలం నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి సోమవారం స్కంధమాత అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

- **ప్యాపిలి:** స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతను సోమవారం లలితాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.
- **బేతంచెర్ల:** మండల పరిధిలోని సిమెంట్ నగర్, సీతారామాపురంలో దుర్గా మాత విగ్రహాన్ని కొలువుంచి పూజలు చేస్తున్నారు. సోమవారం సిమెంట్ నగర్‌లోని అమ్మవారు శాకాంబరి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. బనగానపల్లె రహదారిలో పుట్ట పెద్దమ్మకు పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారిశాలలో వాసవీ మాత గాయత్రీదేవిగా దర్శనం ఇచ్చారు. అలాగే పట్టణంలోని గౌరిపేటలో వెలసిన వేంకటేశ్వర స్వామి గజవాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు.
- **కోవెలకుంట్ల:** పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు సంతాన లక్ష్మీగా పూజలందుకున్నారు. అంకాలమ్మ చౌరస్తాలో వెలసిన ఆలయంలో మారెమ్మ మహాచండీదేవి, సరస్వతీ నగర్‌లోని ప్రసన్నభారతీమాత లలితాదేవిగా భక్తులకు కనువిందు చేశారు.
- **డోన్ టౌన్:** పట్టణంలోని అమ్మవారిశాలో వాసవి కన్యాకాపరమేశ్వరి దేవిని మీనాక్షీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.
- **అవుకు:** ఉత్సవాల్లో భాగంగా స్థానిక అమ్మవారిశాలలోని వాసవీకన్యకాపరమేశ్వరిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.


కోవెలకుంట్లలో సంతాన లక్ష్మీ


అవుకులో అన్నపూర్ణాదేవిగా


భజనలు చేస్తున్న కళాకారులు


గజవాహనంపై విహరిస్తున్న వేంకటేశ్వరుడు

ఆకట్టుకున్న భజనలు

డోన్: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కాళికామాత విగ్రహం వద్ద కళాకారుల భజనలు భక్తులను అలరించాయి. మాలిక్ బాబా సంస్థాన్‌కు చెందిన ప్రసాద్, సుబ్బరాయుడుతో కూడిన భజన బృందం పట్టణంలోని అన్ని విగ్రహాల వద్ద భక్తిగీతాలు ఆలపిస్తూ భజనలు చేస్తోంది.

లలితాత్రిపుర సుందరిగా మహాలక్ష్మి


బేతంచెర్ల: మద్దిలేటిస్వామి ఆలయంలో లలితా త్రిపురసుందరిగా మహాలక్ష్మి

బేతంచెర్ల: మండలంలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారు సోమవారం లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులను కటాక్షించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి సహస్రదీపాలంకరణ సేవను కనుల పండువగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని రథంపై కొలువుదీర్చి మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణ నడుమ ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.